

## వేదన.. రోదన

సదరం కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో దివ్యాంగులు అష్టకష్టాలు పడుతున్నారు. వీరి వేదన అరణ్యరోదనగా మారింది.

-8లో



## చదువుకున్నారు.. చోరీలు ఎంచుకున్నారు

ఒకరు బీటెక్ సివిల్ ఇంజనీరింగ్.. మరొకరు బీఎస్సీ డిగ్రీ.. ఇంకొకరేమో బీటెక్.. వీరంతా చోరీల బాట పట్టారు.

-8లో

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0/22.4

జిల్లాలో శుక్రవారం 22.4 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

కడప సెవెన్‌రోడ్స్: బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకను శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### నేడు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలపై సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా ఒంటిమిట్టలో జరగనున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం అక్కడి టీటీడీ భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు తిరుమల-తిరుపతి దేవస్థానం ఈఓ, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొంటారన్నారు. జిల్లాలోని ఇందుకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

### డీఈఓ వెబ్‌సైట్‌లో జాబితా

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు యాజమాన్యాలలో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు,తత్సమాన కేటగిరీల నుంచి పాఠశాల సహాయకులుగా పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా సబ్జెక్టుల వారీగా (www.kadapadeo.in) డీఈఓ వెబ్‌సైట్‌లో పొందు పరిచినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. సదరు సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు పనిదినాల్లో సాయంత్రం 5 గంటలలోపు రాత పూర్వకంగా సరైన ఆధారాలతో డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని డీఈఓ పేర్కొన్నారు.

### పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలం లోని మాధవరం-1 గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలు బయట తిరుగొద్దని సూచించారు. ప్రస్తుతం జరిగే ఎన్‌సీడీ-సీడీ సర్వే, ఏబీబీఏ(అభా)జనరేషన్, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకాలకు ఈ-కేవైసీ చేయించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతి ,రమణయ్య, ఏఎన్‌ఎంలు పద్మావతి, ఉమా, ఆశా వర్కర్‌లు సుజాత, అదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నేలరాలిన ఆశలు



రైతులపై పాలకులే కాదు ప్రకృతీ పగబట్టింది. చేతికొచ్చిన పంటను.. రైతన్న నోటికాడ కూడును అమాంతం లాగేసింది. అకాల వర్షాలు.. ఈదురుగాలుల రూపంలో పచ్చని పంటను నేలమట్టం చేసింది. పచ్చని అరటిపంటే కాదు.. రైతన్నల ఆశల్నీ నేల రాల్చింది. కోటి ఆశలతో సాగు చేసిన రైతన్నకు కడగండ్లు మిగిల్చింది. జిల్లాలో గురువారం వీచిన ఈదురు గాలులు.. వర్షాలకు భారీ స్థాయిలో పంట నష్టం జరిగింది.

- అకాల వర్షాలు,గాలులకు కూలిన అరటితోటలు
- జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులు



ఖాజీపేట: గాలివాన కారణంగా నేలకొరిగిన అరటి పంట

లింగాల: లింగాల మండలంలో గురువారం బలమైన ఈదురు గాలులకు అరటి పంట నేలకూలింది. మండలంలోని ఇప్పట్ల, అక్కులగారిపల్లె, తేర్నాంపల్లె, పెద్దకుడాల, లింగాల, లోపట్నూతల గ్రామాల్లోని అరటి చెట్లు సుమారు 30ఎకరాలలో నేలకూలాయని రైతులు వాపోతున్నారు. తన అరటితోటలో సుమారు 3వేల అరటి చెట్లు నేలకూలాయని లోపట్నూతల గ్రామానికి చెందిన బాల పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పంట కోతకు వచ్చిన సమయంలో ప్రకృతి వైపరీత్యాలు దెబ్బతీస్తున్నాయని.. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని అరటి రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఉద్యాన శాఖాధికారి రాఘవేంద్రారెడ్డి స్పందిస్తూ ఆర్ఎస్‌కే అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారని, పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామన్నారు. సుమారు 30ఎకరాలలో అరటి పంట కూలిపోయిందని రూ.60లక్షల మేర పంట నష్టం సంభవించినట్లు ఆయన వెల్లడించారు.

### అకాలవర్షం... రైతులకు నష్టం

కొండాపురం: మండల పరిధిలోని తిరుమలాయపల్లె,బుక్కపట్నం వెంకయ్య కాలువ గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి అరటి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే దశలో అనుకోకుండా అకాలవర్షం కురవడంతో పంటలు నేలకొరిగాయి. బుక్కపట్నం, తిరుమలాయపల్లె గ్రామాల్లో మిర్చిపంటలో ఎండు మిరపకాయలకోసం ఉంచిన పొలంలో ఈదురుగాలులు వీయడంతో పండుమిరపకాయలు నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే వెంకయ్యకాలువ లో అరటి కోత దశలో స్వల్పంగా అరటి మొక్కలు నెలకొరిగాయి. దీంతో ఆయా గ్రామాలల్లో రైతులకు నష్టం వాటిలింది.నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



లింగాల: లోపట్నూతలలో నేలకూలిన అరటి తోటలో రైతు బాల పుల్లయ్య



కొండాపురం:ఈదురుగాలులకు విరిగిన అరటి మొక్కలు

### దెబ్బతిన్న అరటి పంట

ఖాజీపేట: గాలి బీభత్సానికి అరటి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొత్తపేట గ్రామానికి చెందిన శశికాంత్‌రెడ్డి అనే రైతు పొలంలో సుమారు 3 ఎకరాల పంట నేలకొరిగింది.. దుంపలగట్టు గ్రామంలో మరో రెండు ఎకరాలు పూర్తిగా నేలకొరిగింది. సుమారు 15లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని రైతులు అంటున్నారు. పంట నష్టంపై ఏఓ నాగార్జున పరిశీలించి పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదించారు.

### తడిసిన పొగాకు



మున్నెల్లి పంచాయతీలో షెడ్లపై పట్టలు లేచిపోయి తడిసిన పొగాకు

బి.కోడూరు: మండలంలోని మున్నెల్లి, ప్రభలవీడు, మేకవారిపల్లె పంచాయతీల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అరటి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ప్రభలవీడు పంచాయతీలోని కత్తెరపల్లెసుబ్బారెడ్డికి చెందిన 6 ఎకరాల అరటిపంట పూర్తిగా నేలపాలైంది. సుమారు రూ.18 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. మండలంలోని మున్నెల్లి పంచాయతీ పరిధిలో ఈ ఏడాది మండలంలో సుమారు 400 ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశారు. ఒక ఎకరా పొగాకు సాగు చేసి అమ్మకం దశ వరకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ ఏడాది పొగాకు కొనుగోలుకు కంపెనీలు మొగ్గు చూపకపోవడంతో మున్నెల్లి, పందివీడు, మేకవారిపల్లె, రాజుపాలెం, గుంతపల్లె తదితర గ్రామాల్లోని రైతులు ఎకరాకు 30 గట్టాల పొగాకును సిద్ధం చేసుకుని కంపెనీల వైపు ఎదురుచూస్తున్నారు. అకాల వర్షానికి సుమారు 1800 గట్టాలకు పైగా పొగాకు తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### రూ.8 లక్షలు నష్టం



ఈ ఏడాది జీపీఎస్ కంపెనీని నమ్మి 6 ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశాను. జీపీఐ కంపెనీ వారు కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో షెడ్డులోనే నిల్వ ఉంచాను. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పొగాకు అంతా పాడైపోయింది. సుమారు రూ.8 లక్షలు నష్టం వాటిల్లింది. -ఎస్.రవీంద్రారెడ్డి, రైతు, మున్నెల్లి, బి.కోడూరు మండలం

# భూ సేకరణ పనులను పూర్తిచేయాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ పార్కుల ఏర్పాటు కోసం చేపట్టిన భూ సేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లేకుండా...త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పై శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జేసీ అదితి సింగ్, డీఎఫ్ఓ వినీత్ కుమార్‌లతో కలిసి సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగుళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేస్తోందన్నారు. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇస్తోందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మూడు రకాలైన సోలార్ అనుబంధ పవ ర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను, ఇతర అనుమతులను క్లియర్ చేయాలన్నారు. జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు సాయిశ్రీ, చిన్న య్య, ఎస్‌హెచ్ఏఐ ఎస్డీసీ వెంకటపతి, పీడీ అశోక్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు వేణుగోపాల్, సుదర్శన్ కుమార్, ఆర్అండ్‌బీ నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, నెడ్ క్యాప్ జిల్లా అభివృద్ధి అధికారి యల్లారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### లక్ష్యాలను అధిగమించాలి

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా.. అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించాల్సిన ప్రగతి.. తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. విత్తనాల ఉత్పత్తి, పంటల మార్పులు, మైక్రో న్యూట్రియన్ల పై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల పంటల సాగుబడిని పెంపొందించాలని.. ఆ దిశగా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టం పై రిపోర్ట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



కల్యాణ వేదిక వద్ద స్వాగత తోరణానికి విద్యుత్ దీపాలంకరణ



మాఢవీధుల్లో భక్తులకోసం ఏర్పాటు చేసిన చలువపందిళ్లు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6వ తేదీ నుంచి 14 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహిచనున్నారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులు చేస్తారు. అనంతరం టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ కుమార్ ఆగమ శాస్త్రం ప్రకారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.ఆలయంలోని పుట్టమన్నును యాగశాలకు తీసుకెళ్లే కార్యక్రమంతో అంకురార్పణ ముగుస్తుంది.

### రేపు ధ్వజారోహణం

ఏప్రిల్ 6న ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 9 వరకు శేష వాహనసేవ జరగనున్నాయి.

- ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. గోపురాలు, కల్యాణ వేదిక, ఇతర ప్రాంతాల్లో విద్యుత్‌దీపాలు అమర్చారు.

### బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చిస్తున్న జేసీ అదితి సింగ్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. శుక్రవారం ఒంటిమిట్టలో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు.కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణ భూషణరెడ్డి, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, డీపీఓ రాజ్యలక్ష్మి, కడప జిల్లా ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి, ఒంటిమిట్ట ఎంఆర్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పేదలపై అక్కసు!

టీడీపీ నేతల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. ఇన్నాళ్లు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై భౌతికంగా దాడులకు దిగిన పచ్చ నేతలు .. తాజాగా వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడానికి యత్నిస్తున్నారు. అధికారుల అండతో సక్రమమైన భూముల్ని సైతం వివాదాస్పదంగా మారుస్తున్నారు. పచ్చ నేతలు తానా అంటే.. అధికారులు తందానా అంటూ చట్టాన్ని తూట్లు పొడుస్తున్నారు.

- వైఎస్సార్ సీపీ నాయకుల భూములపై టీడీపీ టార్గెట్
- ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యం
- అధికారుల సహాయంతో డీకేటీ భూములపై స్టే
- కోర్టుల పేరుతో వేధింపులు



మిడుతూరు గ్రామంలోని పొలంలో బోర్డును పాతిన రెవెన్యూ అధికారులు



కడప టాస్క్‌ఫోర్స్: తెలుగుదేశం నాయకులు ఊర్ల మీద పడ్డారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పని చేశారన్న కారణంతో ఆ పార్టీ కార్యకర్తలపై పగబట్టారు. ఏదో ఒక వంక చూపిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. అధికారం అండ చూసుకుని సక్రమమైన భూమిని వివాదాస్పద భూమిగా మార్చి కోర్టుల చుట్టు తిప్పి ముప్పతిప్పలకు గురి చేస్తున్నారు. ఖాజీపేట మండలంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

- ఖాజీపేట మండలం మిడుతూరులో గత ఎమ్మెల్యే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సుమారు 350 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నాయకులు కొందరు వైఎస్సార్ సీపీకి పనిచేసిన వారిని ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీలో కీలకంగా ఉంటున్న జింకా అరుణ్ కుమార్ తోపాటు జింకా కుళ్లాయమ్మలను టార్గెట్ చేశారు.

### అభ్యంతరం లేని భూమి వివాదస్పదంగా చేసి...

జింకా కుళ్లాయమ్మ అనే మహిళకు సర్వేనంబర్ 297లో 20సెంట్లు, 298-1 లో 98 సెంట్లు, 299 లో 16 సెంట్ల భూమి ఉంది. మొత్తం 1.31 సెంట్ల భూమి ఉంది. ఈ భూమికి 2005లో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ ఇలా అన్ని అర్హతలు ఉన్నాయి. సుమారు 20 ఏళ్లుగా వీరు భూమి సాగు చేసుకుంటున్నారు. తాజాగా ఈ భూమిపై రెవెన్యూ అధికారులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ స్టే కారణంగా భూమిలో ఎవరూ సాగు చేయవద్దని అధికారులు బోర్డు పాతి పెట్టి హక్కుదారులకు హెచ్చరికలు చేశారు. అలాగే జింకా అరుణ్ కుమార్ అనే మరొకరికి 298-2 లో ఎకరా, 298-3 లో ఎకరా మొత్తం రెండెకరాల పొలం ఉంది. ఈ పొలం పూర్తిగా చుక్కల భూమి. ఈ పొలాన్ని సైతం రెవెర్యూ అధికారులు వివాదాస్పదం చేశారు. కోర్టు ఆదేశాల మేకు పొలంలో ఎవరూ సాగు చేయవద్దని సాగుదారులకు రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

### కోర్టు నుంచి స్టే వచ్చినా...

సదరు భూములపై బాధితులు తమకు ఉన్న న్యాయపరమైన హక్కులను చూపుతూ కోర్టును ఆశ్రయించారు. డిసెంబర్ 2024లోనే కోర్టు తలుపుతట్టారు. ఈ మేరకు బాధితులకు అనుకూలంగా ఈ ఏడాది మార్చి 29న కోర్టు నుంచి స్టే ఆర్డర్ వచ్చింది. ఆ ఉత్తర్వులను రెవెన్యూ అధికారులకు చూపించారు. సదరు కోర్టు స్టే ఉత్తర్వులు చూపినా అధికారులు స్పందించడం లేదంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. పొలంలో బోర్డును అలాగే ఉంచడంపై బాధితులతో పాటు స్థానికులు మండిపడుతున్నారు.

### గ్రామనత్తం భూమిపై వివాదాస్పదంగా మార్చి..

మిడుతూరు గ్రామంలో 371-1 సర్వేనంబర్‌లో సుమారు 7.10 ఎకరాల స్థలం గ్రామనత్తం స్థలం గా ఉంది. ఈ స్థలంను పోలు సుబ్బరాయుడు, పోలు నారాయణ, పోలు సిద్దయ్య, వీరయ్య అనుభవంలో ఉంది. 73 ఏళ్ల నుంచి వీరి అనుభవంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు సైతం గుర్తింపు పత్రం ఇచ్చారు. దీనిపైనా కొందరు నాయకులు తరచూ వివాదం చేస్తూ పోలీసులు, రెవెన్యూ సహకారంతో వీరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరోవైపు తెలుగుతమ్ముళ్ల తీరుతో అధికారులు బేజారవుతున్నారు. వారు చెప్పినట్లు వినకుంటే బదిలీ పేరిట ఎక్కడ దూరంగా వేస్తారోనన్న భయంతో చెప్పిందానికల్లా వింటున్నారు. దీనివల్లే కోర్టుల చుట్టు తిరగాల్సి వస్తోందన్నది కొందరు అధికారులు వాపోయారు.

### కక్ష సాధింపు ధోరణిలో భాగమే..

వంకపై కాంప్లెక్ నిర్మాణం చేశారని అధికారులు చర్యలకు దిగారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లాకు నోటీసు ఇచ్చారు. దీంతో తన కాంపెక్స్‌ను కరీముల్లా స్వయంగా తొలగించుకున్నారు.. కానీ వాస్తవానికి వంక మొత్తం పూర్తిగా ఆక్రమణలు ఉన్నాయి. అందులో కేవలం ఒక్కరికి మాత్రమే నోటీసులు ఇచ్చి కూల్చివేసేలా చేశారు. తరువాత ఉన్న ఆక్రమణల పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే మరికొందరి డీకేటీ భూముల పై చర్యలకు దిగడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా వేధింపులకు దిగడం సరైంది కాదని స్థానికులు అంటున్నారు. చర్యలు తీసుకుంటే అందరిపై తీసుకోవాలని.. ఇలా కొందరిని మాత్రమే టార్గెట్ చేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### కోర్టు ఆదేశాల మేరకు నోటీస్ బోర్డు

కోర్టునుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు పొలాల్లో బోర్డు ఏర్పాటు చేశాం.. ఆ నోటీస్ పై కోర్టు ఉత్తర్వులు వచ్చినట్లు తెలియదు. పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నాం.. లబ్దిదారుల రికార్డు పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటాం.

-మహబూబ్ బాషా, తహసీల్దార్

## క్లుప్తంగా

### హుండీలో నగదు చోరీ

**పోరుమామిళ్ల :** మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయ అన్నదాన సత్రంలో గురువారం రాత్రి హుండీలో డబ్బు చోరీ జరిగిందని ఈఓ నరసయ్య తెలిపారు. గురువారం రాత్రి భారీ వర్షం కురిసిందని, ఆ సమయంలో వాచ్‌మ్యాన్ రామసుబ్బయ్య ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి.. అన్నదాన సత్రం గేటు తాళం పగలగొట్టి హుండీ తీసుకెళ్లారన్నారు. నగదు తీసుకుని, ఆలయ సమీపంలోని ముళ్లపొదల్లో హుండీ పడవేసి వెళ్లారన్నారు. శుక్రవారం ఈఓ నరసయ్య ఏఎస్ఐ మూర్తికి ఫిర్యాదు చేయడంతో పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ముగ్గురు క్రికెట్ బుకీల అరెస్ట్

**ప్రొద్దుటూరు క్రైం :** స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ యోగీంద్రలు శుక్రవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ప్రొద్దుటూరుకు చెందిన బొర్రా లక్ష్మికాంతరెడ్డితో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.42 వేలు నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### ఎక్సైజ్ ఎస్ఐలుగా ఇద్దరు నియామకం

**కర్నూలు :** ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టులను భర్తీ చేస్తూ ఆ శాఖ నోడల్ అధికారి (డిప్యూటీ కమిషనర్) శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పని చేస్తున్న 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతి కల్పించి బదిలీల్లో భాగంగా వారికి స్టేషన్లు కేటాయించారు. వీరిలో ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు ఇద్దరు బదిలీ అయ్యారు. ఎస్సీ, ఎస్టీ మహిళా ఎస్ఐలకు సంబంధించి మరో నాలుగు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వీరి సీనియారిటీ జాబితా త్వరలోనే రూపొందించి ఆయా పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తెలిపారు. పదోన్నతి పొందిన వారందరికీ శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ప్రమోషన్‌తోపాటు పోస్టింగ్ కాపీ అందజేశారు. కర్నూలు డీసీ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్న డి.పీరాన్‌బి రాయచోటి ఎక్సైజ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల డీపీఈఓలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.సతీష్‌కుమార్‌ను బద్వేలు స్టేషన్‌కు బదిలీ చేశారు.

### ఆ స్థలంపై మాకు పట్టా ఉంది

– సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి నారాయణ

**కడప సెవెన్‌రోడ్స్ :** కడప భగత్‌సింగ్‌నగర్ పరిధి సర్వే నంబరు 344లోని స్థలం తన భార్య పి.పద్మమ్మ పేరిట డి.ఫారం ఉన్న మాట వాస్తవమని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'సీపీఎం నేతల చుట్టూ స్థల వివాదం' శీర్షికన గురువారం సాక్షి టాబ్లాయిడ్‌లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. గుడి పేరుతో ఆ స్థలాన్ని కాజేసేందుకు గతంలోనూ, ఇప్పుడు కొంతమంది సంఘ విద్రోహులు గొడవలు సృష్టించి పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకపక్క స్కూలు, మరో పక్క ఇల్లు ఉన్న స్థలంలో గుడి నిర్మించేందుకు మరొక స్థలాన్ని కాజేయాలనుకోవడం దుర్మార్గపు ఆలోచనగా పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీలోనే ఉంటూ కమ్యూనిస్టుల మీద, కమ్యూనిస్టు ఉద్యమాల మీద చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. భూ దందాలు, వసూళ్లకు పాల్పడే వారు ఉంటే ధైర్యంగా పేర్లతో సహా ఎవరు ఎంత భూమి ఆక్రమించారో, అమ్ముకున్నారో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలకు డిమాండ్ చేయాలన్నారు.

### వైభవంగా ముగిసిన జాతర

**రాజంపేట టౌన్ :** పట్టణంలోని బలిజపల్లె గ్రామంలో గత రెండు రోజులుగా జరిగిన గంగమ్మ జాతర వేడుకలు వైభవంగా ముగిశాయి. గత బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన జాతర వేడుక.. శుక్రవారం వేకువజామున అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా పొలిమేర్లకు సాగనంపడంతో ముగిసింది. గంగమ్మ ప్రతిమను భక్తులు చేతుల మీదుగా ఊరేగిస్తూ పొలిమేర్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు గంగమ్మకు ఎదురుగుంభంగా ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారి ఊరేగింపులో భాగస్వాములు అయ్యేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ ఏడాది జాతరలో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకుల అంచనా.


# వేదన.. రోదన



**ఈ**యన పేరు నాగేంద్ర. కడప నగరంలోని నబీకోట ఆక్కాయపల్లిలో కొన్నేళ్లుగా నివాసం వుంటున్నారు. పక్షవాతంతో బాధపడుతూ వుండగా, 2020లో దివ్యాంగుల సర్టిఫికెట్‌ను రిమ్స్ అధికారులు మంజూరు చేశారు. ఆయనను స్ట్రెక్చర్‌పైన తీసుకుని వస్తేగానీ, రాలేని దయనీయ పరిస్థితిలో వున్నాడు. అతని భార్య నరసమ్మ మాట్లాడుతూ తన భర్తకు 2020 నుంచి దివ్యాంగుల సర్టిఫికెట్‌ను ఇచ్చి పింఛన్‌ను ఇస్తున్నారని తెలిపారు. నడవలేని, మంచానికే పరిమితమైన తన భర్తను ఇప్పుడు పిలిచారని ఆవేదన వ్యక్తం చేశారు.



**ఈ**మె పేరు కందూరి పద్మ (55). బంధువులు ఎవరూ వెంట రాలేని పరిస్థితిలో వుంటే.. ఆమె కుమారుడి స్నేహితుడు 'రీ వెరిఫికేషన్' కోసం తీసుకుని వచ్చారు. కుర్చీకే పరిమితమైన ఈమెకు 2017లో దివ్యాంగుల సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. తమ పనులను కూడా చేసుకోలేని పరిస్థితిలో వుండగా, ఆమెను కూడా రిమ్స్‌కు 'రీ వెరిఫికేషన్' కోసం రప్పించారు.



**ఈ**నెల 2వ తేదీన కడప నగరానికి చెందిన ఓ యువకుడిని తన తండ్రి, కుటుంబ సభ్యులు చేతుల మీదుగా నడిపించుకుని తీసుకుని వచ్చారు. తరువాత శిబిరం నుంచి డాక్టర్ వద్దకు తీసుకుని వెళ్లేటపుడు.. అక్కడున్న స్ట్రెక్చర్ బాయ్‌ని బ్రతిమలాడితే అపుడు డాక్టర్ వద్దకు తీసుకుని వెళ్లారు.

- సదరంలో దివ్యాంగుల అగచాట్లు
- కుటుంబ సభ్యుల అవసోపాలు
- అర్హత ఉన్నా తప్పని పునఃపరిశీలన
- అందుబాటులో లేని వీల్‌చైర్లు, స్ట్రెచర్లు
- రిమ్స్‌లో కనీస సౌకర్యాలు కరువు

**సొంతంగా ఏ పని చేసుకోలేని వారు.. కొందరు పుట్టుకతో.. ఇంకొందరు అనారోగ్యం కారణంగా వైకల్యం బారిన పడిన వారు.. వీరంతా నిరుపేదలు. ప్రభుత్వ సాయంతోనే నాలుగు ముద్దలు నోటికాడికి వెళ్తాయన్న దివ్యాంగులు వీరు. అయితే వీరి పింఛన్లలో కోత పెట్టాలని కూటమి నిర్ణయించింది. పునఃపరిశీలన కోసం పిలిపిస్తోంది. అయితే సదరం కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో దివ్యాంగులు అష్టకష్టాలు పడుతున్నారు. వీరి వేదన అరణ్యరోదనగా మారింది.**

**కడప అర్బన్ :** కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సర్టిఫికెట్ల పునః పరిశీలన కోసం వస్తున్న దివ్యాంగులలో దయనీయస్థితిలో వున్నవారు లేకపోలేదు. ఇందుకు ప్రత్యక్షంగా ఈ నెల 2,3 తేదీలలో 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది. మంచానికి, వీల్‌చైర్‌లకే పరిమితమై, వారి వ్యక్తిగత పనులను కూడా కుటుంబ సభ్యులపై ఆధారపడి జీవించే వారిని కూడా 'రీ వెరిఫికేషన్' పేరుతో నోటీసులు ఇచ్చి కడప రిమ్స్‌కు రప్పిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు దివ్యాంగుల జాబితాను తగ్గించే దిశగా.. రాష్ట్ర వ్యాప్తంగా వారిని మరలా 'రీ వెరిఫికేషన్' పేరుతో తమ సమీపంలో మెడికల్ బోర్డ్ వున్న ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ప్రతి మనిషికి కనిపించగానే.. ప్రత్యక్షంగా వీరికి వికలత్వం వుందని ఇట్టే తెలిసిపోతుంది. కానీ అలాంటి వారిని కూడా వదిలిపెట్టకుండా 'రీ వెరిఫికేషన్' నోటీసులను ఇచ్చి వేధింపులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- రిమ్స్ ఓపీ విభాగానికి ఎదురుగా ఏర్పాటు చేసిన షామియానా, కుర్చీలను 'రీ వెరిఫికేషన్'కు వస్తున్న దివ్యాంగుల కోసం వినియోగిస్తున్నారు. అయితే వేసవి కాలంలో కనీసం తాగేందుకు 'మంచినీటి' సౌకర్యం కూడా కల్పించకపోవడం దారుణం. అసలే మూడు రోజులుగా ఓపీ క్యాంటీన్‌ను మూసివేయడం వల్ల అక్కడికి వస్తున్న రోగులకు, వారి సహాయకులకు కనీసం అల్పాహారం, టీ, కాఫీ, మజ్జిగ, నీటి సౌకర్యం కరువయ్యాయి. రిమ్స్ అధికారులు గానీ, డీఆర్‌డీఏ విభాగానికి చెందిన అధికారులైనా స్పందించి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సర్టిఫికెట్ల పునఃపరిశీలన కోసం వచ్చిన దివ్యాంగులు, వారి సహాయకులు

- ఒకవైపు నానా తిప్పలు పడి అక్కడికి 'రీ వెరిఫికేషన్'కు వస్తున్న దివ్యాంగుల పాలిట కొందరు 'చిరుద్యోగుల' చేష్టలు కూడా శాపంగా మారుతున్నాయి. 'రీ వెరిఫికేషన్' చేయించుకునేందుకు వచ్చిన వారికి 'తప్పకుండా' మరలా సర్టిఫికెట్‌ను యథావిధిగా చేయిస్తామని మాయమాటలను చెప్పి తమ జేబులను నింపుకొంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో 'రీ వెరిఫికేషన్' సర్టిఫికెట్ కోసం వేలాది రూపాయలను వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ప్రజలు అనుకుంటున్నారు. వీల్‌చైర్, స్ట్రెక్చర్‌ల కొరత స్పష్టంగా తెలుస్తోందని పేర్కొంటున్నారు.
- దివ్యాంగుల కష్టాలు, ఇబ్బందులపై సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఎవరైనా తమకు ఫిర్యాదు చేసినా, తమ దృష్టికి వచ్చినా చర్యలను తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే 'రీ వెరిఫికేషన్'కు దివ్యాంగులను పిలిపిస్తున్నామని వివరణ ఇచ్చారు.

## మహిళను హత్య చేసేందుకే స్కెచ్

- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు

**ఖాజీపేట :** వడ్డీకి డబ్బులు ఇచ్చి తిరిగి తీసుకోవడంలో వచ్చిన మనస్పర్థలు.. హత్య చేయించే వరకూ వెళ్లాయి. ఈ సంఘటనలో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లూరు పంచాయతీలోని బంగ్లా సమీపంలో భాగ్య అనే మహిళ నివాసం ఉంటోంది. ఆమె వడ్డీ వ్యాపారంతోపాటు రియల్ ఎస్టేట్, ఇలా అనేక రకాల వ్యాపారాలు సాగిస్తోంది. కడపకు చెందిన ఓబుల్ రెడ్డి అనే వ్యక్తికి సుమారు రూ.13 లక్షల మేరకు పలు దఫాలుగా వడ్డీకి డబ్బులు ఇచ్చింది. డబ్బులు తిరిగి చెల్లించాలని ఆమె గత కొంత కాలంగా అడుగుతూ వచ్చింది. అయితే ఓబుల్‌రెడ్డి డబ్బులు ఇవ్వడంలో పూర్తి నిర్లక్ష్యం చేశాడు. దీంతో భాగ్య కడపలోని ఓబుల్‌రెడ్డి ఇంటికి వెళ్లి గట్టిగా నిలేసి అడిగింది. ఇంటికి తాళం వేసి రావడంతో అతను జరిగిన సంఘటనను అవమానంగా భావించాడు.

**హత్య చేయాలని మనుషులను పురమాయించి..**

అవమానం కాస్తా వ్యక్తిగత కక్షగా మారడంతో ఓబుల్ రెడ్డి ప్రతీకారం తీర్చుకోవాలని భావించాడు. అందుకోసం కడప నుంచి సుమారు 15 మంది వ్యక్తులను మార్చి 31న పంపించాడు. రాత్రి 8 గంటల నుంచి భాగ్య ఇంటి చుట్టూ రెక్కీ నిర్వహించారు. రాత్రి 10 గంటల పైన ఆమెపై దాడి చేయడానికి ప్రయత్నించారు. ఇంటికి లోన తాళం వేసుకోవడంతో అనుకున్న ప్లాన్ అమలు చేయలేక పోయారు. బయటవచ్చి గొడవ చేస్తున్న వారు అందరూ కొత్తవారు కావడం.. ఆమె గట్టిగా కేకలు వేయడం, అలాగే ఫోన్‌లో అందరికీ సమాచారం ఇవ్వడంతో.. వారిని స్థానికులు కర్రలు తీసుకుని వెంబడించారు. అందరూ అక్కడి నుంచి పరారయ్యారు. వారిలో గ్రామస్తులకు ఇద్దరు చిక్కారు. వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం భాగ్య పోలీసులకు తనకు జరిగిన సంఘటనలపై ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

**పరారీలో సూత్రధారి**

భాగ్యపై హత్యాయత్నం చేయడంలో కీలక పాత్ర వహించిన ఓబుల్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. ఆయనతోపాటు మరి కొంత మంది దొరకాల్సి ఉంది. వీరిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయితే సూత్రదారి పోలీసులకు దొరికితే గానీ.. సంఘటనకు కారణమైన పూర్తి వివరాలు బయటపడే అవకాశం ఉంది.

## విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, బంధువులు
- స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- బద్వేలులోని ఏవీఆర్ స్కూల్‌లో ఘటన

**బద్వేలు అర్బన్ :** ఇటీవల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మరువక ముందే.. అటువంటి సంఘటన మరొకటి పునరావృత్తమైంది. పట్టణంలోని సుందరయ్యకాలనీ సమీపంలో గల ఏవీఆర్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై.. అదే పాఠశాలలో కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పెంచలయ్య అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత విద్యార్థిని జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో.. వారితోపాటు బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. బద్వేలు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని త్యాగరాజకాలనీకి చెందిన ఓ విద్యార్థిని సుందరయ్యకాలనీ సమీపంలోని ఏవీఆర్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో గోపవరం మండలం అడుసువారిపల్లె గ్రామానికి చెందిన పెంచలయ్య కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అయితే కొంత కాలంగా పెంచలయ్య బాధిత విద్యార్థినితోపాటు మరికొంత మంది విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో త్యాగరాజకాలనీకి చెందిన విద్యార్థిని.. ఉపాధ్యాయుడి ఆగడాలను తట్టుకోలేక శుక్రవారం తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తల్లిదండ్రులతోపాటు బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తరలించారు. అనంతరం విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు పెంచలయ్యపై అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ కేసు నమోదు చేశారు. కాగా ఇటీవల కాలంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులపై జరుగుతున్న వరుస ఘటనలతో తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు ఇలా అసభ్యంగా ప్రవర్తించడం సరికాదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు

## చదువుకున్నారు.. చోరీలు ఎంచుకున్నారు

- నకిలీ పత్రాలతో ప్లేవుడ్ బోర్డులు కాజేసిన యువకులు
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- ఇద్దరు అరెస్టు, పరారీలో ఒకరు

**బద్వేలు అర్బన్ :** ఒకరు బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. మరొకరు బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. ఇంకొకరేమో బీటెక్ చివరి దశలో మానేశారు. ఉద్యోగ, ఉపాధి మార్గాలు ఎంచుకుని ఉన్నతంగా ఎదగాల్సిన వీరు.. దురలవాట్లకు బానిసలుగా మారి పక్కదారి పట్టారు. చేసిన అప్పులు తీర్చేందుకు, జల్సాల కోసం చోరీల బాట పట్టారు. చివరకు ఇద్దరు పోలీసులకు చిక్కి కటకటాల పాలు కాగా, మరొకరేమో పరారీలో ఉన్నాడు. గోపవరం మండలం పి.పి.కుంట సమీపంలోని సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ నుంచి నకిలీ పత్రాలతో ప్లేవుడ్ బోర్డులు కాజేసేందుకు యత్నించగా రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.నాగభూషణ్ ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. గోపవరం మండలం పి.పి.కుంట సమీపంలోని సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్లేవుడ్ బోర్డులను ఎగుమతి చేస్తుంటారు. ఇందు కోసం వివిధ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని వారి ద్వారా వాహనాలను సమకూర్చుకుంటారు. ఈ క్రమంలో కలకత్తాకు చెందిన సరస్వతి ప్లైబోర్డ్ లిమిటెడ్ కంపెనీ ద్వారా సెంచరీ పానెల్స్ పరిశ్రమకు రూ.5 లక్షల విలువ చేసే 885 ప్లేవుడ్ బోర్డుల ఆర్డర్ వచ్చింది. ఇందుకు సెంచరీ పరిశ్రమ యాజమాన్యం వాహనం కోసం తమ వెబ్‌సైట్‌లో పొందుపరచగా... విజయవాడకు చెందిన ఫైన్ లాజిస్టిక్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ వాహనం సమకూర్చే హక్కును దక్కించుకుంది. అయితే అప్పటికే సంబంధిత ట్రాన్స్‌పోర్ట్ కంపెనీతో సంబంధాలున్న నెల్లూరు జిల్లా సీతారామపురం గ్రామం పడమటివీధికి చెందిన ఆకులమహేష్ ముందస్తు ప్రణాళికలో భాగంగా కంపెనీ తరఫున తన స్నేహితుడైన పూంగవనంశివకుమార్ ద్వారా నకిలీ ఆర్‌సీ, ఎఫ్‌సీ, పర్మిట్ సృష్టించి మరొక స్నేహితుడైన మనీష్ ద్వారా వేరొక వాహనానికి నంబర్ ప్లేట్ మార్చి గత నెల 20వ తేదీన సరుకును తీసుకెళ్లాడు. అయితే సరుకును కలకత్తాకు తీసుకెళ్లకుండా నెల్లూరులోని ఓ గదిలో భద్రపరిచి.. కొద్ది రోజుల తర్వాత అమ్ముకోవాలని ప్లాన్ చేసుకుని ఫోన్లు స్విచ్చాఫ్ చేశారు. కంపెనీ నుంచి సరుకు బయటికి వెళ్లినప్పటి నుంచి అన్‌లోడ్ చేసే వరకు వాహనాన్ని జీపీఎస్ ట్రాకింగ్ చేస్తారు. అయితే ఫోన్లు స్విచ్చాఫ్ కావడంతో ట్రాకింగ్ లభించలేదు. దీంతో అనుమానం వచ్చిన కంపెనీ ప్రతినిధులు ఈ నెల 2వ తేదీన రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సీఐ ఎం.నాగభూషణ్, బి.కోడూరు ఎస్ఐ కె.సి.రాజులు సిబ్బందితో కలిసి గాలిస్తుండగా శుక్రవారం పి.పి.కుంట సమీపంలో ఆకులమహేష్, పూంగవనం శివకుమార్‌లను అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరు పరచగా న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇదే కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న మనీష్ కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా నిందితులు నెల్లూరు జిల్లా ముత్తుకూరు స్టేషన్ పరిధిలో కూడా గత నెల 25న ఇదే తరహాలో పామాయిల్ డబ్బాలను లోడ్ చేసుకుని చేర్చవలసిన పాయింట్‌కు చేర్చకుండా కాజేసే యత్నం చేసినట్లు విచారణలో తేలినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుళ్లు శ్రీను, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ నాగభూషణ్

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**గోపవరం :** మండలంలోని సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఎదురుగా నెల్లూరు – ముంబై (ఎన్‌హెచ్–67) జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. 50 సంవత్సరాల వయసు గల మతిస్థిమితం లేని మహిళ అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై నడిచి వెళుతుండగా.. బద్వేలు నుంచి వస్తున్న లారీ అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశ్రమ వద్ద ఉన్న సీసీ కెమెరా ద్వారా పరిశీలించారు. మృతి చెందిన మహిళ మృతదేహాన్ని పోలీసులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన మహిళ పసుపురంగు చీర ధరించి ఉందని, ఆమె బద్వేలు ప్రాంతానికి చెంది ఉండవచ్చని, ఎవరికైనా మహిళ గురించి వివరాలు తెలిస్తే వెంటనే బద్వేలు రూరల్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## జూదరుల ముఠా అరెస్ట్

- రూ.16.50 లక్షలు, మూడు వాహనాలు స్వాధీనం
- 10 మందిపై కేసు నమోదు
- నిందితులలో ఏఆర్ కానిస్టేబుల్?

**సాక్షి టాస్క్‌ఫోర్స్ :** పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని అంబకపల్లె గ్రామం వద్ద గురువారం రాత్రి పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, రూరల్ సీఐ వెంకటరమణల ఆధ్వర్యంలో జూదరులను అరెస్టు చేశారు. 10 మంది జూదరులపై కేసు నమోదు చేసినట్లు, వారి నుంచి మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. లింగాల పోలీస్‌స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకోవడంతో.. లింగాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

**ఎస్పీ పర్యవేక్షణలో అరెస్టు**

గురువారం రాత్రి జూదరుల అరెస్టు పూర్తిగా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో జరిగినట్లు సమాచారం. ఎస్పీ స్పెషల్ బ్రాంచ్ టీం ద్వారా మానిటరింగ్ చేసి అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. పులివెందుల నుంచి జూదరులు ప్రతి నిత్యం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి పరిసర ప్రాంతాలలో జూదానికి వెళ్లేవారు. అక్కడి ఎస్పీ, వైఎస్సార్ జిల్లా ఎస్పీ సమాచారంతో జూదరులను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

**నిందితులలో ఏఆర్ కానిస్టేబుల్?**

పోలీసులు అరెస్టు చేసిన జూదరులలో ఏఆర్ కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని నందిమండలం గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జూదానికి వెళ్లినట్లు తెలుస్తోంది. అతని వద్ద నుంచే రూ.16.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే కేసు నమోదు చేసిన నిందితులలో ఏఆర్ కానిస్టేబుల్ పేరు పోలీసులు నమోదు చేశారో లేదో అన్న విషయం తెలియాల్సి ఉంది. అతనిపై కేసు నమోదు చేశారని, చేయలేదని వాదనలు వినిపిస్తున్నాయి. అయితే కేవలం అతని వద్ద ఉన్న నగదును మాత్రమే పులివెందుల పోలీసులు కేసులో చూపించారని ప్రచారం జరుగుతోంది. మిగిలిన వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ము గురించి తెలియాల్సి ఉంది. మిగిలిన నిందితుల వద్ద కూడా భారీగా నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జూదరులు బహిరంగంగా చెప్పుకొంటున్నారు.

**యథేచ్ఛగా జూదాలు**

పులివెందుల నియోజకవర్గంలో యథేచ్ఛగా జూదాలు జరుగుతున్నాయి. కొంతమంది అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జూదాలు జరుగుతున్నాయి. వాటికి ఇక్కడి పోలీసు అధికారుల అండదండలు పూర్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. జూద నిర్వాహకుల నుంచి పోలీసు అధికారులకు నిత్యం మామూళ్లు వెళుతున్నాయని జూదరులు చెప్పుకొంటున్నారు. పులివెందుల జూదరులను ఎస్పీ పర్యవేక్షణలో అరెస్టు చేశారంటే ఇక్కడి పోలీసు అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో తెలుస్తోంది.

**సీఐ ఏమన్నారంటే.. :**

జరిగిన సంఘటనపై 'సాక్షి' విలేకరి సీఐ వెంకటరమణకు ఫోన్ చేయగా.. 10 మందిపై కేసు నమోదు చేశామని, రూ.16.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ గురించి అడగగా దర్యాప్తు చేస్తున్నామని, తెలియాల్సి ఉందని చెప్పారు.

## పోలీసుల అదుపులో పేపర్ లీకేజీ కేసు నిందితుడు

**వేంపల్లె :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు చెందిన పేపర్ లీకేజీలో వేంపల్లెకు చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి గణితం పరీక్ష రోజున కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరులో లీకేజీ అయిన పేపర్.. వేంపల్లెలోని ఒక ప్రైవేట్ పాఠశాలకు ఫార్వర్డ్ అయినట్లు తెలిసిందే. దీంతో పేపర్ లీకేజీకి కారణమైన తొమ్మిది మందిని అప్పట్లో కమలాపురం పోలీసులు అరెస్టు చేశారు. వారిలో 8 మందికి బెయిల్ వచ్చింది. అలాగే పేపర్ లీకేజీకి కారణమైన వేంపల్లెకు చెందిన మరో వ్యక్తిని కూడా శుక్రవారం కమలాపురం పోలీసులు అరెస్టు చేసి విచారణ చేసినట్లు సమాచారం.

## ధ్వజస్తంభంపై పడిన పిడుగు

**కలసపాడు :** మండలంలోని కొండపేట గ్రామంలో గురువారం రాత్రి మెరుపులు, ఉరుములతో వర్షం కురిసింది. గ్రామంలోని రామాలయ ధ్వజస్తంభంపై పిడుగు పడటంతో.. ధ్వజస్తంభంపైన ఉన్న శిఖరం కింద పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అలాగే సిద్ధమూర్తిపల్లె – కలసపాడు గ్రామాల మధ్యలోని రెడ్డికాలనీ వద్ద చెట్టుపై పిడుగు పడటంతో కొంత మేర కాలింది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.



దెబ్బతిన్న ధ్వజస్తంభం